ప్రజాశక్తి

బుధవారం 10 డిసెంబరు 2025

5

శ్రీకాకుళం

విశాఖలో 18న తపాలా అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విశాఖ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల సమస్యల పరిష్కార నిమిత్తం ఈనెల 18న ఉదయం 11 గంటలకు 120వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవిపి బస్ కాంప్లెక్స్ పక్కన ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి తదితర 9 జిల్లాల పరిధిలోని వినియోగదారులు తమ ఫిర్యాదులను 15వ తేదీ లోగా అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి.సాగర్, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం-530017 చిరునామాకు కూడా పంపవచ్చని, కవరుపై 120వ తపాలా అదాలత్ అని పేర్కొనాలని సూచించారు.

జిల్లాలో రెవెన్యూశాఖ చాలా దారుణంగా తయారైంది. జిల్లా, మండల స్థాయి పరిధిలో పరిష్కరించాల్సిన చిన్న చిన్న భూ సమస్యలను ఆ శాఖ అధికారులు పరిష్కరించకుండా రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. గ్రీవెన్స్, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారు. భూములు చాలావరకు వృద్ధుల పేరుతో ఉండడంతో తిరగలేక నానా అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం కనీసం కనికరించడం లేదు. భూ సమస్యలతో తహశీల్దార్‌కు వినతిపత్రం, డాక్యుమెంట్ల నకళ్లు ఇస్తే జాయింట్ కలెక్టర్ దగ్గర పని వేగంగా అయిపోతుంది వెళ్లండంటూ సలహా ఇస్తున్నారు. తీరా గ్రీవెన్స్‌కో, జెసిని కలవడానికి వస్తే మండలాల్లోనే పనైపోతుంది... ఇక్కడకెందుకు వచ్చారంటూ అధికారులు ముఖం చిట్లించుకుంటున్నారు. దీంతో ఎక్కడికి వెళ్లాలో, ఏం చేయాలో రైతులకు దిక్కుతోచడం లేదు.

రెవెన్యూ దారుణం

గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు తన బాధ చెప్పుకుంటున్న యాగాటి అప్పయ్య దంపతులు

- భూ సమస్యల పరిష్కారంలో ఘోర విఫలం
- తమ పరిధిలో ఉన్న అంశాలనూ పరిష్కరించని వైనం
- యంత్రాంగం తీరుతో ఉసూరుమంటున్న రైతులు
- గత ప్రభుత్వ తప్పిదాల పేరుతో తప్పించుకుంటున్న అధికారులు

గత ప్రభుత్వ తప్పిదమంటూ తప్పించుకుంటున్న వైనం

రైతుల ఇబ్బందులకు గత వైసిపి ప్రభుత్వమే కారణమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి దిగువ స్థాయి అధికారుల వరకు నిందిస్తున్న పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో విఆర్‌ఒ, జిల్లాలో జెసి స్థాయిలో పరిష్కరించాల్సిన చిన్న చిన్న సమస్యలనూ పరిష్కరించకుండా తప్పించుకోవడంపై రైతులు మండిపడుతున్నారు. రైతులు ఇబ్బందులు పడితే వైసిపి ప్రభుత్వంపై ఇలానే కసి కొనసాగుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో అనేక జఠిలమైన సమస్యల పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మండల, జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్, తహశీల్దార్, జెసిలకు వస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికంగా భూ సమస్యలపైనే ఉంటున్నాయి. వాటిలో రికార్డు ఆఫ్ రైట్స్ (ఆర్‌ఒఆర్), రీసర్వే, 22ఎ (నిషేధిత భూముల జాబితా), జాయింట్ ఎల్‌పిఎం, భూ విస్తీర్ణం తగ్గుదల, జిరాయితీ భూమి ప్రభుత్వ భూమిగా నమోదు కావడం వంటి వాటిపైనే రైతుల నుంచి అధికంగా వస్తున్నాయి. 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వం చేపట్టిన భూ సమగ్ర సర్వేలో దొర్లిన తప్పిదాలతో రైతులకు ఇప్పటికీ అవస్థలు తప్పడం లేదు. తమ భూముల వివరాలను సరిచేయాలంటూ అధికారులు, కార్యాలయాల చుట్టూ నిత్యం తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా రైతుల భూ సమస్యలు రెవెన్యూ అధికారులకు ఒక ఆటగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రీవెన్స్‌కు వచ్చిన వినతులపై తహశీల్దార్‌కు రాయడం, అక్కడకు వెళ్తే ఆయన సర్వేయర్‌ను పురమాయించడం ఇది సర్వసాధారణమైపోయింది. తమ సమస్య పరిష్కారం కాలేదంటూ బాధితులు మళ్లీ గ్రీవెన్స్‌కు రావడం ఇదే తంతుగా సాగుతోంది.

వృద్ధులైనా కనికరం చూపని యంత్రాంగం

కంచిలి మండలం బూరగాంకు చెందిన ఎం.రాధాబాయి వయసు సుమారు 75 పైబడి ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యానికి ఈ వయసులో ఆమె కొడుకును వెంటబెట్టుకుని తహశీల్దార్, గ్రీవెన్స్ చుట్టూ తిరుగుతున్నారు. తనకు వారసత్వంగా సంక్రమించిన సర్వే నంబరు 126-7పిలో 1506 ఎల్‌పిఎంతో కుటుంబసభ్యులతో కలిసి జాయింట్ ఎల్‌పిఎం వచ్చిందని, భూమిని సర్వే చేసి తన హక్కుగా దక్కిన 0.96 సెంట్ల భూమిని 1.526 సెంట్ల నుంచి సబ్ డివిజన్ చేయించి, మరో కొత్త ఎల్‌పిఎం నంబరు ఇప్పించాలంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సచివాలయానికి వెళ్తే అక్కడ సిబ్బంది ఇక్కడ కాదని, తహశీల్దార్ కార్యాలయానికి పంపారు. అక్కడకు వెళ్తే జెసి లాగిన్‌లో అయిపోతుందని జెసిని కలవాలంటూ సలహా ఇచ్చారు. తీవ్ర వ్యయప్రయాలతో గ్రీవెన్స్‌కు వస్తే మండలంలోనే అయిపోతుందంటూ జెసి అసహనం వ్యక్తం చేసి, తన సిబ్బందికి రాసి వారిని పంపేశారు. రణస్థలం మండలం కమ్మసిగడాంకు చెందిన యగాటి అప్పయ్యకు 85 ఏళ్లు. ఈయనకు 1979లో అప్పటి ప్రభుత్వం 1.50 సెంట్ల డి-పట్టా భూమిని ఇచ్చింది. 2023లో వైసిపి ప్రభుత్వం చేపట్టిన సర్వేలో వెబ్‌ల్యాండ్‌లో ఆయన పేరు గల్లంతైంది. అక్కడి క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వాకంతో ఆ భూమి వారి బంధువైన యాగాటి సత్యవతి పేరుతో అడంగల్, వన్‌బి వస్తోంది. సమస్యను పరిష్కరించాలంటూ 2024 నుంచి తహశీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తన కొడుకు సాయంతో తిరుగుతూనే ఉన్నాడు. తాజాగా ఈ నెల ఎనిమిదో తేదీన గ్రీవెన్స్‌కు వచ్చిన బాధితుడిని, తహశీల్దార్‌ను కలవాలని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. అక్కడకు వెళ్తే సర్వేయర్‌కు చెప్తామంటూ వారిని పంపేశారు.

రైతులతో ఆటాడుకుంటున్న రెవెన్యూ అధికారులు

గత ప్రభుత్వం చేపట్టిన భూ సమగ్ర సర్వే ఫలితంగా రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. భూమి వేరే వారి పేరు మీద ఉండడంతో అన్నదాత సుఖీభవ, ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ వంటి సౌకర్యాలను కోల్పోతున్నారు. కనీసం బ్యాంకుల నుంచి రుణం కూడా తీసుకోలేకపోతున్నారు. రైతులు ఇలా ఇబ్బంది పడుతుంటే, ఎద్దు పుండు కాకికి ముద్దు అన్న చందంగా ఉంది పై నుంచి కిందిస్థాయి అధికారుల పరిస్థితి. గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై వస్తున్న వినతుల విషయంలో కలెక్టరేట్ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమకు వచ్చిన వినతులను సిసిఎల్ఎ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్)కో, తహశీల్దార్‌కో పంపాల్సి ఉంటుంది. ఆ పనిచేయడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పుడో తీరుబాటు చూసుకుని తహశీల్దార్లకు రాస్తున్నారు. వారు దయతలిస్తే జెసికి పంపుతున్నారు. లేకుంటే బుట్టదాఖలవుతున్నాయి.

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గుణుపల్లి రైతులు

సెంటు భూమి కూడా ఇవ్వం

ఆర్‌డిఒకు తేల్చిచెప్పిన గుణుపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సెంటు భూమి కూడా ఇవ్వబోమని రైతులు తేల్చిచెప్పారు. మండలంలోని గుణుపల్లి సచివాలయంలో ఆర్‌డిఒ జి.వెంకటేష్, ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ సీతారామ్మూర్తి గుణుపల్లి రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారాన్ని అధికారులు వివరించారు. భూముల ధరకు రెండున్నర రెట్లు పరిహారం అందిస్తామని, తోటల్లో ఉన్న మొక్కలకు, బావులకు, అవుల శాలలకు రెట్టింపు పరిహారం అందిస్తామన్నారు. ల్యాండ్ పూలింగ్ చట్టం ద్వారా భూములు కోల్పోయిన రైతులకు కొంత విలువైన భూములు అందిస్తామని చెప్పి రైతుల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం మాట్లాడిన రైతులు... తిత్లీ తుపాను ధాటికి చెట్లు నేలమట్టమైతే, ఎంతో శ్రమించి తోటల్లో చెట్లు పెంచుకొని వ్యవసాయం చేస్తున్నామన్నారు.

పూర్వీకుల నుంచి వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నామని, ప్రభుత్వం ఇచ్చే డబ్బులను తామేం చేసుకుంటామన్నారు. అభివృద్ధికి తాము ఆటంకం కాదని... ప్రభుత్వ భూములు ఉండగా, తమ భూములపై ఒత్తిడి తేవడంతో ఆవేదన చెందుతున్నామని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్వాసిత ప్రాంతంలో చిన్న చిన్న రైతులే ఉన్నారని, వారికి అన్యాయం చేయొద్దని కోరారు. భూములు వదులుకోవడానికి సిద్ధంగా లేమని చెప్తూ వినతిపత్రం అందించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంపై పునరాలోచించాలని అధికారులను కోరారు. ఈ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు చెప్పి సమావేశాన్ని ముగించారు.

పిజి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లోని ఆర్ట్స్, సైన్స్ పిజి కోర్సులకు చెందిన మూడో సెమిస్టర్ పరీక్షలు కేంపస్ కేంద్రంగా మంగళవారం మొదలయ్యాయి. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 17వ తేదీ వరకూ ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్... సబ్జెక్టుకు ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి 319 మందికి గానూ 17 మంది హాజరు కాలేదు. సైన్స్ కోర్సులకు సంబంధించి 395 మందికి గానూ ఎనిమిది మంది పరీక్ష రాయలేదు. సైన్స్ కోర్సులకు ఆర్ అండ్ డి డీన్ ఎస్.లోకేశ్వరి, ఆర్ట్స్ కోర్సులకు అసిస్టెంట్ ప్రిన్సిపాల్ హెచ్.సుబ్రమణ్యం పరీక్షల చీఫ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఎపిజె అబ్దుల్ కలాం బ్లాక్‌లో నిర్వహించిన పరీక్షలను వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.స్వప్నవాహిని పరిశీలించారు. డి.పి.ఇడి, బి.పి.ఇడి పరీక్షలు కూడా మంగళవారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్న ఈ పరీక్షలు ఈనెల 12వ తేదీ వరకూ కొనసాగుతాయి. తొలి రోజు ఈ పరీక్షలకు సుమారు 380 మంది హాజరయ్యారు.

10.30 గంటల వరకు తెరవలేదు

- సకాలంలో హాజరు కాని మెట్టక్కివలస సచివాలయ సిబ్బంది
- గైర్హాజరుపై చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - ఆమదాలవలస

మున్సిపాలిటీలోని 10, 11వ వార్డులకు సంబంధించిన మెట్టక్కివలస-1 వార్డు సచివాలయం మంగళవారం ఉదయం 10.30 గంటలైనా తెరవకపోవడం స్థానికులను ఆగ్రహానికి గురిచేసింది. ఆ సమయానికి ఒక్క ఉద్యోగి కూడా సచివాలయానికి చేరుకోకపోవడంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పిఎం అవాస్ యోజన నమోదు కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కాకపోవడంపై టిడిపి నాయకులు నాగళ్ళ మురళీధర్ యాదవ్, మునగవలస రవీంద్రబాబు దృష్టికి వార్డు ప్రజలు తీసుకువెళ్లడంతో వారు వార్డు సచివాలయం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అనంతరం 10.30 గంటలకు ఇద్దరు ఉద్యోగులు సచివాలయం వద్దకు రావడంతో స్థానిక నాయకులు, ప్రజలు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గంటలకు మరో ఉద్యోగి సచివాలయానికి చేరుకున్నారు. ఎనిమిది మంది ఉండాల్సిన సిబ్బందిలో ముగ్గురు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఈ సచివాలయంలో విఆర్‌ఒ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉందని, మిగతా నలుగురు సచివాలయ సిబ్బంది సెలవులో ఉన్నారని సచివాలయ సిబ్బంది తెలిపారు. ఫిర్యాదుపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సచివాలయానికి చేరుకుని హాజరు రిజిస్టర్ సహా రికార్డులను పరిశీలించారు. నలుగురు గైర్హాజరైనట్లు గుర్తించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి

రిమ్స్ నుంచి రిఫర్ రాకూడదు

- మెరుగైన వైద్య సేవలే లక్ష్యం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వైద్య సేవల కోసం వచ్చే రోగులు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు లక్ష్యంగా పనిచేయాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 29వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కమిటీ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన వారిని విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయకూడదని, వైద్యం కోసం వచ్చిన ప్రతి వ్యక్తిని సరైన వైద్యం అందించాలన్నారు. మెరుగైన వైద్య సదుపాయం అందించేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. అవసరమైన వైద్య నిపుణులను పలు ప్రాంతాల నుంచి రప్పించి వైద్య సదుపాయం కల్పించాలని ఆదేశించారు. నెఫ్రాలజీ యూనిట్‌లో ఐసియులో నాలుగు పడకలు పర్మినెంట్‌గా ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని, రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌కు అవసరమైన ఉపకరణాలు, యంత్ర పరికరాలు ఉండాలన్నారు. రోగులకు నాణ్యమైన ఆహారం పెట్టాలన్నారు. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధులతో అనేక ఉపకరణాలు సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆస్పత్రిలోకి కుక్కలు, ఎలుకలు, విష సర్పాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని షిఫ్టుల్లో రౌండ్ దా క్లాక్ డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం రోగులకు అందించాలని ఆదేశించారు. రోగుల అటెండెన్స్‌కు క్యూఆర్ కోడ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని, అన్ని విభాగాల్లో వైద్యులు సిబ్బంది, స్టాఫ్ నర్సులు బాధ్యత తీసుకోవాలన్నారు. డి-అడిక్షన్ సెంటర్‌కు ఆరుగురు వైద్యుల నియామకం కోసం రిక్రూట్‌మెంట్, సకాలంలో జీతాల చెల్లింపు, సైకియాట్రిస్ట్ విభాగానికి గ్రిల్స్ ప్రతిపాదన, మరుగుదొడ్ల సక్రమంగా నిర్వహణ, ఎసిలు నిరంతర పర్యవేక్షణ, శానిటేషన్, ఎమర్జెన్సీ, హాస్టల్ మెస్, హాస్టల్స్ నిర్వహణ, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రూ.66 లక్షలతో ఏర్పాటు చేసిన ఉపకరణాలను ప్రారంభించారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, జిజిహెచ్ సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్, వైద్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)-2025 పరీక్ష ఈనెల పది నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు ఒడిశాలోని బరంపురం, గంజాంలో నిర్వహించే పరీక్షకు 10,499 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎచ్చెర్ల, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్, టెక్కలిలోని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ పరీక్షా కేంద్రాల్లో 9,221 మందికి కేటాయించామన్నారు. బరంపురం, గంజాంలోని పరీక్షా కేంద్రాల్లో 1278 మంది అభ్యర్థుల హాజరవుతారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు మండల విద్యాశాఖ అధికారులను డిపార్ట్‌మెంటల్ అధికారులుగా నియమించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలు రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తున్నామన్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రాలకు గంట సమయం ముందుగా హాజరు కావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు ఎటువంటి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. శ్రీకాకుళం, బరంపురం, గంజాం జిల్లాల్లో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి సందేహాలున్నా శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో జి.చంద్రభూషణ్ సహాయ కమిషనర్, 7569633183, పి.సంతోష్ కుమార్ సూపరింటెండెంట్ 7989139860, కె.శ్యామలరావు సీనియర్ అసిస్టెంట్, 9494094904, డి.రోజా రమణి కంప్యూటర్ అసిస్టెంట్ 8328269673 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లలో తప్పులు గుర్తిస్తే డిపార్ట్‌మెంట్ అధికారులకు అభ్యర్థుల ఎస్ఎస్‌సి పాస్ సర్టిఫికెట్, పిహెచ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు కాపీని చూపించి నామినల్ రోల్‌లో వాటిని మార్పు చేసుకోవాలని సూచించారు.

అభ్యుదయం సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి చేతుల మీదుగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఈనెల 12వ తేదీన ప్రారంభమయ్యే 'అభ్యుదయం సైకిల్‌యాత్ర' అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ప్రయాణించి, 16వ తేదీన ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం నగరంలోకి ప్రవేశించనుందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్ర జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగి ఇచ్ఛాపురంలో ఈనెల 29న ముగియనుందని తెలిపారు.

కోటి సంతకాల సేకరణకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కుంభ రవిబాబు తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోటి సంతకాలు, రచ్చబండ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన టిడిపి ప్రభుత్వంపై ప్రజలకున్న వ్యతిరేకతకు అద్దం పడుతోందన్నారు. టెక్కలి నియోజకవర్గంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి సంబంధించి సంతకాల ప్రతులు నాలుగు మండలాల నుంచి టెక్కలి వైసిపి కార్యాలయానికి మంగళవారం చేరాయని తెలిపారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. ఈనెల 15వ తేదీన శ్రీకాకుళంలో భారీ ర్యాలీ నిర్వహించి వైసిపి రాష్ట్ర కార్యాలయానికి ప్రతులు చేరవేయనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కోటి సంతకాల ప్రతులు టెక్కలి నుంచి పదో తేదీ ఉదయం టెక్కలి వైఎస్సార్ జంక్షన్ నుంచి ర్యాలీ ప్రారంభించి శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయానికి చేరవేయనున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ తెలిపారు.

లక్ష్యాల సాధనలో వేగం పెంచాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ శాఖల పనితీరులో వేగం పెంచి, కీలక పనితీరు సూచికలు (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్) ఆధారంగా లక్ష్యాలను సమయపాలనతో పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాఖల వారీగా సమీక్షించారు. కెపిఐ ఆధారంగానే శాఖల పనితీరు మూల్యాంకనం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి తావులేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సానుకూల దృక్పథంలో ఆర్‌టిసి, పెన్షన్ల పంపిణీ, ఇంటింటికీ చెత్త సేకరణ అంశాల్లో ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆర్‌టిసి సిబ్బంది ప్రవర్తన, ప్రయాణికుల రక్షణ అంశాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంపై అధికారులను కలెక్టర్ అభినందించారు. బస్టాండ్లలో మంచినీరు సరఫరా, పారిశుధ్యం వంటి కీలక అంశాలు బాగా మెరుగుపడాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ వద్ద పలు దుకాణాల పక్కనే పెద్దఎత్తున చెత్త పేరుకుని ఉండడాన్ని తాను స్వయంగా చూశానని పేర్కొంటూ, పారిశుధ్య పరిస్థితి వెంటనే మారకపోతే దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, మైనారిటీ వెల్ఫేర్, అటవీ శాఖ, గృహనిర్మాణ శాఖ, ఐసిడిఎస్, ఎస్‌సి కార్పొరేషన్ల ప్రగతిపై చర్చించారు.

ఫిర్యాదులకు నిర్ణీత గడువులో పరిష్కారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన ఫిర్యాదులపై నిర్ణీత గడువులో విచారణ చేసి, చట్టప్రకారం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల దర్యాప్తు వేగవంతం తదితర అంశాలపై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సబ్ డివిజన్, సర్కిల్, స్టేషన్ స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునిపై గౌరవంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను శ్రద్ధగా వినాలన్నారు. ప్రజా ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా తక్షణమే నమోదు చేసి, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు స్వీకరించిన పబ్లిక్ గ్రీవెన్స్‌ను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రతి కేసు దర్యాప్తు చట్టబద్ధంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్ దొంగతనం, పోగొట్టుకున్న సందర్భాల్లో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి, పోగొట్టుకున్న మొబైళ్లను త్వరగా ట్రేస్ చేసి వారికి అప్పగించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి సముఖమునకు

E.P.No: 30/2025 IN O.S.No: 188/2017

Between:-
Tangudu Giridharudu
.....Decree holder/Plaintiff
And:-
Varanasi Malleshwara Rao
.......Judgement debtors/Dependants.
To,
Jdrs No.4:-
Korada Venkataramana, S/o late latchayya, aged 76 years, business,resident of Door No.9-100, Satyanaraya nagar, Narasannapeta Town and Mandal, Srikakulam District.

నోటీస్

సదరు EP No.30/2025లో నోటీసులు మీకు సర్వీసు కానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తము **తేదీ 17-12-2025న వాయిదా అయి ఉన్నది.** గనుక సదరు వాయిదా నాడు మీరు స్వయంగా గాని అడ్వకేట్ ద్వారా గాని కోర్టుకు **10.30 గంటలకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించడం అగునని ఇందుమూలంగా మీకు తెలియపరచడమైనది

యేరుకోల మురళీమోహనరావు
న్యాయవాది,
శ్రీకాకుళం, ఫోన్: 9440105598.

కోచ్, మేనేజర్ల నియామకం

కృష్ణ లక్ష్మణరావు రాంబాబు లక్ష్మీనారాయణ

నీలకంటేశ్వరరావు సుజాత లోకేష్‌రావు గణేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

69వ నేషనల్ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ టెన్నిస్ గేమ్స్ అండర్-14 ,17, 19 ఇయర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ కోచ్, మేనేజర్లుగా ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియమించింది. జిల్లా నుంచి 8 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు అవకాశం లభించింది. మధ్యప్రదేశ్‌లోని దివాస్ నగరంలో స్కూల్‌లో 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు 11 నుంచి 14 వరకు నిర్వహించారు. జన్ని కృష్ణ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాపర, మెళియాపుట్టి మండలం), దొర లక్ష్మణరావు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగువాడ, పాతపట్నం మండలం), కోళ్ల రాంబాబు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెళియాపుట్టి మండలం), దొర లక్ష్మీనారాయణ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెంబూరు, పాతపట్నం మండలం), లోకొండ గణేష్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దపద్మాపురం, మెళియాపుట్టి మండలం), లక్ష్మీపురం నీలకంఠేశ్వరరావు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాలవలస, టెక్కలి మండలం) సారపెల్లి సుజాత (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గులుమూరు, హిరమండలం), జమ్ము లోకేశ్వరరావు (అక్షరది స్కూల్, పాతపట్నం మండలం) ఎంపికయ్యారు. వీరి ఎంపికపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సలహాదారు పి.సుందర్రావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పి.తవితయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.వి.రమణ, జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజ్ సెక్రటరీ రమణ అభినందించారు.

సిక్కోలు హరిత మహోత్సవం ఆదర్శం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం అసోసియేషన్ అఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యాన నిర్వహించిన సిక్కోలు హరిత మహోత్సవం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. 80 రోడ్డులోని బృందావనం హోటల్‌లో ఏర్పాటు చేసిన సిక్కోలు హరిత మహోత్సవాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో ప్రతిఒక్కరికీ అవగాహన వస్తుందని తెలిపారు. ఇందులో స్టాల్స్‌ను సందర్శించి, అబ్బురపరిచే అంశాలను తెలుసుకున్నారు. మిల్లెట్ ఫుడ్, టెర్రస్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్స్, కంప్రెస్డ్ ఆయిల్స్, హ్యాండ్లూమ్స్, ఇత్తడి వస్తువులు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, హోమ్ మేడ్ ఆర్గానిక్ ఆహారం వంటి విభిన్న విభాగాలు ఆకర్షణగా నిలిచాయన్నారు. ప్రతి స్టాల్‌నీ సందర్శించి, పరిశీలించి, నాణ్యతను వాటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణం, ఆరోగ్యం, సహజ జీవన విధానాల ప్రోత్సాహానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసర మని పేర్కొన్నారు. సహజ ఉత్పత్తులు, వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాల ప్రదర్శనకు వేదికగా నిలుస్తోందని హితవుపలికారు. చీఫ్ ఆర్గనైజర్ ఎన్.విజయ్‌కుమార్, సెక్రటరీ దార్లపూడి రవి, కో-చైర్మన్ నటుకుల మోహన్, గీతాశ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ డాక్టర్ వండాన సచిత్ర, శాప్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.శ్రీరామ్మూర్తి, సెక్రటరీ డాక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు మరో రెండు రోజులు పాటు కొనసాగనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- కంచిలి

సాయికుమార్ (ఫైల్)

మండలంలోని జలంత్రకోట జాతీయ రహదారి కూడలి వద్ద మంగళవారం మధ్యాహ్నం సంభవించి రోడ్డు ప్రమాదంలో గోకర్ణపురానికి చెందిన సీర సాయికుమార్ (28) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోకర్ణపురానికి చెందిన సీర శ్యామ్, చంద్రమ్మలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాయి పదో తరగతి వరకు చదివి, ఉపాధి కోసం బయట దేశాలకు వెళ్లాడు. మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మరలా ఉపాధి కోసం వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. మంగళవారం తన స్నేహితుడు కోసం సామగ్రిని కొనుగోలు చేసేందుకు సోంపేట ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. జలంత్రకోట జాతీయ రహదారి వద్దకు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పనులు చేపడుతున్న డ్రమ్ములకు ఢీకొట్టింది. అనంతరం రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సాయి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పారినాయుడు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సాయికుమార్ తమ్ముడు ఏడాది క్రితం రైలు ప్రమాదంలో చనిపోయాడు. చేతికందిన ఇద్దరు పిల్లలు ఇలా ప్రమాదాల్లో మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది. సంఘటనపై మృతుడి తండ్రి శ్యామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైండోవర్ కేసు నమోదు చేస్తున్న తహశీల్దార్ వెంకటరావు

ఏడుగురిపై బైండోవర్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఏడుగురు నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ వెంకటరావు సమక్షంలో మంగళవారం వీరిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే రూ.లక్ష అపరాధ రుసుం, ఏడాది పాటు జైలు ఉంటుందని హెచ్చరించారు. మద్యం షాపుల్లో అధిక ధరలకు అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ కళాశాలలో ఐసిఇఎంటిఎ-25 పేరుతో అంతర్జాతీయ రెండవ సదస్సు ఈ నెల 10, 11, 12 తేదీల్లో హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తున్నామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, టెక్ ఇన్నోవేషన్స్ వంటి మౌలిక రంగాల్లో చేపడుతున్న తాజా పరిశోధనలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణుల సమక్షంలో నిర్వహిస్తామని వివరించారు. దేశ, విదేశాల నుంచి అనేక మంది పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొనున్నట్లు తెలిపారు. కళాశాల పరిశోధనస్థాయి మరింతగా అభివృద్ధి చెందేందుకు, విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ వేదిక నిలుస్తుందన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు9 మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు విజయవాడలో తన క్యాంప్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్ రోడ్ల కోసం పంపించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ధన్యావాదాలు తెలిపారు. నియోజకవర్గంలో 52.54 కిలోమీటర్ల అంచనా వ్యయం రూ.17 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయునికి గోల్డెన్ అవార్డు

ప్రజాశక్తి- నందిగాం

నారాయణమూర్తి

మండలంలోని పెద్దతామ రాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మార్పు నారాయణ మూర్తికి గోల్డెన్ క్రియేటివ్ అవార్డు లభించింది, కోనసీమ జిల్లా కాట్రేనికోనకి చెందిన క్రియేటివ్ హార్స్ సంస్థ మాస్టర్ స్ట్రోక్ ఫైవ్ పేరుతో ఇటీవల నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ పోటీలో మొదటి 40 బెస్ట్ ఆర్ట్స్‌లో ఆయన వేసిన చిత్రం స్థానం సంపాదించడంతో ఈ అవార్డు వచ్చింది. అవార్డుకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నమూనా చిత్రం

రణస్థలం ఫ్లైఓవర్ బ్రిడ్జి నమూనా

ప్రజాశక్తి- రణస్థలం

16వ నవంబరు జాతీయ రహదారి రణస్థలం మండల కేంద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జికి సంబంధించి నిర్మాణం చేపడుతున్న సంస్థ మేనేజర్ రాధాకృష్ణ మంగళవారం నమూనా చిత్రాన్ని విడుదల చేసింది. 4.7 కిలోమీటర్ల పొడవున వంతెన నిర్మించనున్నారు. రామతీర్థాలు కూడలి నుంచి సినిమా హాలు కూడలి వరకు 800 మీటర్ల మేర 21 స్తంభాలు, ఇరువైపులా 600 మీటర్ల పొడవున గోడలు కడతారు. వంతెన పైభాగంలో 24 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలు, కింద పదిన్నర మీటర్ల వెడల్పుతో సర్వీసు రహదారులు నిర్మించనున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

విత్తన చట్టాలను రద్దు చేయాలి

సోంపేట : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విత్తన చట్టాలను తక్షణమే రద్దు చేయాలని మామిడిపల్లి పంచాయతీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సచివాలయ ఉద్యోగులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలన్నారు. వంశధార నది జలాలను ఇచ్ఛాపురం వరకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న రైతాంగ వ్యతిరేక చట్టాలను, కార్యకలాపాలను రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పాతిని కృష్ణమూర్తి, రైతు సంఘ అధ్యక్షులు జుత్తు సింహాచలం, కార్యదర్శి ఎం.లోకనాథం, గోరకల పాపారావు, కర్రి సింహాచలం, టి.రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

సంత అభివృద్ధి పనులు వేగవంతం

కోటబొమ్మాళి: జిల్లాలోనే అతిపెద్ద నారాయణవలస గురువారం సంత అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిఇ సుధాకర్, జెఇ అజిత్‌కుమార్‌తో కలిసి మంగళవారం సంతమైదానం పరిశీలించారు. ఈ సందర్భంగా 16 షాపులు, రూ.2 కోట్ల వ్యయంతో అంతరగత సిసి రోడ్డు, అలాగే పశువులకు సంబంధించిన షెడ్లు, ప్రజలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ముందుగా ఇంజినీరింగ్ సిబ్బంది సంబంధిత పనులను నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. స్థానికుల నుంచి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు టిపి పంగ రమేష్, స్థానికులు ఉన్నారు.

సాయివినీత్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి సాయి వినీత్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి స్పెల్ బీ పోటీల్లో తమ సత్తా చాటారు. కళింగపట్నం వేదం ఇంటర్నేషనల్ ఎఐ అకాడమీ 2025-26 ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి స్పెల్ బీ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనపరిచి మొత్తం ఐదు బహుమతులు సొంతం చేసుకోవడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. జూనియర్స్ విభాగంలో 4వ తరగతికి చెందిన కలగ రిషిత జిల్లాస్థాయి ప్రథమ బహుమతి, 3వ తరగతికి చెందిన గుమ్మడి వేదార్యన్‌కు ద్వితీయ బహుమతి లభించింది. సీనియర్స్ విభాగం నుంచి 7వ తరగతికి చెందిన బుడగట్ల కుసుమకు తృతీయ బహుమతి పొందగా, 6వ తరగతికి చెందిన గున్న పావని నాలుగో బహుమతి, 9వ తరగతి విద్యార్థి షావుకారి జస్మితకు ఐదో బహుమతి కైవసం చేసుకున్నారు. పోటీ ప్రపంచంలో అద్భుతమైన ఫలితాలు సాధించాలనే తపన నిత్యం ఉండాలని విద్యార్థి దశలో నిరంతరం నైపుణ్యాలు పెంపొందించే దిశగా మీ ప్రయత్నాలు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు, వైద్యులు కె.లీలా, చాపర కోదండరావు, ప్రిన్సిపాల్ ఎ.కైలాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ లీల


అభినందిస్తున్న అధ్యాపకులు

దాతల సహకారంపై హర్షం

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా దాతలు ప్రకటించిన సహకారంపై సిబ్బంది మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ బలగ మురళి రూ.50 వేలు, అరుణకుమారి (జూనియర్ అసిస్టెంట్) రూ.50 వేలు, వాన గోవిందరావు (జమ్ము) రూ.20 వేలు, చిట్టి సాయికిరణ్ (డైరెక్టర్, సాయిరత్న ఐటిఐ) రూ.20 వేలు, నందాన బాబ్జీ రూ.10 వేలు, రుప్ప సోమశేఖర్ (జెఎల్) రూ.5 వేలు, ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ రూ.20 వేలు చొప్పున కళాశాల అభివృద్ధికి విరాళాలు ఇచ్చినట్లు సిబ్బంది తెలిపారు. దాతల సహకారంతో కళాశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ప్రిన్సిపాల్ తెలిపారు. తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజనానికి వంటశాల నిర్మాణం, ఇతర మరమ్మతులకు నిధులను వినియోగిస్తానని తెలిపారు. పూర్వ విద్యార్థులందరూ ఈ విషయాన్ని గుర్తించి తమ కళాశాలకు నిధులు సమకూర్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం నియోజవర్గ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మానవ హక్కుల గురించి వివరించారు. సెల్‌ఫోన్లు వల్ల విద్యార్థులపై ఎటువంటి ప్రభావం ఉంటుంది అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రెసిడెంట్ డి.కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్వర్ణ భారతి డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 10న ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంబాబు, ఎడ్యుకేషనల్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ కె.సి.పూరి, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, స్వర్ణ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సందీప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

పర్యవేక్షిస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

పింఛనుదారులకు ముప్పతిప్పలు

ప్రజాశక్తి- మందస

మండలంలో రాజకీయ ఒత్తిళ్లతో 18 మంది స్పౌజ్ పింఛనుదారులకు ఎనిమిది నెలలుగా పింఛను అందడం లేదు. అంబుగాం, రాంపురం, బిడిమి, కొంకడాపుట్టి పంచాయతీల్లోని పింఛనుదారులకు నాలుగో నెల పింఛను మంజూరైంది. వెల్ఫేర్ లాగిన్‌లో పేర్లు ఉన్నా వెల్ఫేర్ అసిస్టెంట్ ఇవ్వకుండా తిరిగి ప్రభుత్వ అధికారులకు పంపించేశారు. దీంతో పింఛనుదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. బాధితులు మండల కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదు. ఓ పక్క రాజకీయ అండదండలు చూసుకుని సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తూ... నిమ్మక నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొత్తగా వచ్చిన ప్రధానమంత్రి ఆవాస్య యోజన కింద మంజూరైన ఇళ్ల విషయంలోనూ రాజకీయ జోక్యం విపరీతంగా చేసుకుంటున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ వై.వెంకటరమణను వివరణ కోరగా, డిఎల్‌డిఒ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని జాతీయరహదారి బుడుమూరు సమీపంలో ఆర్‌టిసి బస్సు మంగళవారం మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దీంతో ఎండలో నడిరోడ్డుపై ప్రయాణికులు అవస్థలు పడ్డారు. శ్రీకాకుళం-2 డిపోకు చెందిన పల్లెవెలుగు 60 మందికి పైగా ప్రయాణికులతో విశాఖపట్నం వెళ్తుంది. 11 గంటల సమయంలో బుడుమూరుకు సమీపంలో ఒక్కసారిగా మరమ్మతులు గురై నిలిచిపోయింది. చాలా సమయం వరకూ వేరే బస్సు రాకపోవడంతో నడిరోడ్డుపై ప్రయాణికులు నిల్చొని అవస్థలు పడ్డారు. సమయానికి గమ్యానికి చేరులేకపోయామని అసహనం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయొద్దని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. మండలంలోని కొసమాల పంచాయతీలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను మంగళవారం సేకరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, పల్లి యోగి, వైసిపి నాయకులు జయమునిరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ఊర్లన బాలరాజు, లింగాల సంజీవరావు, కరణం శశిభూషణరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రణస్థలం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాలు పూర్తయ్యాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆదేశాల మేరకు వైసిపి శ్రేణుల మద్దతుతో కోటి సంతకాల కార్యక్రమం పూర్తయిందన్నారు.

ప్రకృతి వ్యవసాయం ముద్దు

ప్రజాశక్తి- రణస్థలం

ప్రకృతి వ్యవసాయం చేసి అదనపు ఆదాయం పొందాలని ప్రకృతి వ్యవసాయ కోస్టల్ రిజినల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ రైతులకు సూచించారు. మండలంలోని రణస్థలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతుల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణలో భాగంగా పెద్దింటి రాజేశ్వరి, గులివిందల సురేష్ ప్రధాన పంట మొక్కజొన్నలో అంతర పంటలుగా తోటకూర, గోంగూర, కూరగాయలు పండించడం వల్ల రైతుకు కలుపు నివారణతో పాటు అధిక మొత్తంలో ఆదాయం కూడా వస్తుందని తెలిపారు. మొక్కజొన్న చుట్టూ జొన్నలు మూడు వరుసలు, బెండొక వరుస వాటి చుట్టూ తీగజాతి అయిన బీరాకాకర, ఆనప వేయడం వల్ల సరిహద్దు పంటలపై కొన్ని రకాల పురుగులు తెగుళ్లను నివారించవచ్చునని అన్నారు. అదనపు ఆదాయం కూడా లభిస్తుందన్నారు. పంటల వైవిధ్యత ఉండటం వల్ల పురుగులు తెగుళ ఉద్రిక్తను తగ్గించవచ్చునని తెలిపారు. నేల సారవంతంగా పంచవచ్చునని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంతోషికుమారి, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

లావేరు : ఏకపంట విధానాన్ని విడనాడి బాహుల పంటలు విధానంతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని, ఈ విధానాన్ని అనుసరించాలని ప్రకృతి వ్యవసాయం నార్త్ కోస్టల్ రీజనల్ టెక్నాల్ అధికారి హేమసుందరరావు అన్నారు మండలంలోని కొత్తకుంకాంలో రైతు కె.జగన్నాథం పొలంలో మొక్కజొన్న పంటలో అంతర్ పంటలుగా వేసిన పెసర గోంగూర, తోటకూర, ముల్లంగి పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ఆచరిస్తూ... వేయడం వల్ల ఆదాయంతో పాటుగా ఆరోగ్యమైన పంటలు దిగుబడి వస్తుందని అన్నారు మొక్కజొన్న పంటల వైవిధ్యత వేయడం వల్ల నేలలో సూక్ష్మ జీవులు వైవిధ్యత పెరుగుతుందని, చీడ పిడలను తట్టుకుంటుందని చెప్పారు తక్కువ ఖర్చుతో బహుళ ప్రయజనాలు చేకూరుతాయని అన్నారు.

లావేరు : రైతుతో మాట్లాడుతున్న హేమసుందరరావు

రోస్టర్ అమల్లో అవకతవకలు

వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎఎస్ఎం గ్రేడ్ -3 నుంచి గేడ్ -2 కి 159 ఉద్యోగోన్నతుల్లో దళిత, ఆదివాసి అభ్యర్థులకు పూర్తిగా రోస్టర్ అమలు చేయలేదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని దళిత ఆదివాసీ జెఎసి ప్రతినిధులు వాబ యోగి, డి.గణేష్, మిస్కా, కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ఎఒ బాబూరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బ్యాక్‌లాగ్ ద్వారా నియమకం అభ్యర్థులను కూడా రోస్టర్ పాయింట్ చూపించి పూర్తిగా దళిత, ఆదివాసీ అభ్యర్థులకు గ్రేడ్ -3 ఉద్యోగులు ఇవ్వకుండా అడ్డగోలుగా కమీషన్లకు కక్కుర్తిపడి రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయలేదని అన్నారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆదేశాలు ఉన్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జన్ని ఆరుద్ర, ఐల కుమారి, సవర కృష్ణవేణి పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు దిశానిర్దేశం

శిక్షణలో పాల్గొన్న కృష్ణారావు, తిరుమలకుమార్

ప్రజాశక్తి- కవిటి

టిడిపి బలోపేతానికి, కార్యకర్తల్లో రాజకీయ అవగాహన పెంపొందించేలా దిశానిర్దేశం చేయడానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తోందని మండల అధ్యక్షులు పొందల కృషారావు, ప్రధాన కార్యదర్శి బెందాళం తిరుమలకుమార్ అన్నారు. జాతీయ కార్యాలయం మంగళగిరిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం నాయకులు పాల్గొన్నట్టు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, రాబోయే పంచాయతీ ఎన్నికలకు అనుసరించాల్సిన వ్యూహం, బూత్ స్థాయిలో బలపరిచే చర్యలపై నిపుణులు మార్గదర్శనం చేశారన్నారు. ప్రజా సమస్యలను తక్షణమే గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర నాయకులు పాల్గొని పార్టీ లక్ష్యాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారని తెలిపారు. శిక్షణ అనంతరం, తమ మండలాల్లో టిడిపి విస్తరణకు కృషి చేస్తామని అన్నారు.

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నారాయణమూర్తి

నారాయణమూర్తి సందడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రిమ్స్ కళాశాలలో సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి మంగళవారం సందడి చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో ముచ్చటించారు. విద్యారంగ సమస్యలపై ఆయన స్వీయ దర్శకత్వంలో తీసిని యూనివర్సిటీ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా రిమ్స్‌కు వచ్చారు. బుధవారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడనున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సిఐ

ప్రజాశక్తి- పలాస

పలాస ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాశీబుగ్గ సిఐ వై.రామకృష్ణ మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలాస పట్టణంలో శాంతిభద్రతలను కాపాడతానని సూచించారు.

మొక్కను అందజేస్తున్న సిఐ రామకృష్ణ

గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- బూర్జ

ఆముదాలవలస నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ ఆటల పోటీల్లో మండలంలోని కొల్లివలస డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఇందులో సీనియర్స్ విభాగం నుంచి బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచారు. 800, 400, పరుగు పందెంలో ద్వితీయస్థానంలో నిలిచారు. వంద మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించారు. జూనియర్స్ విభాగం నుంచి వాలీబాల్ విన్నర్స్‌గా నిలిచారు. నియోజకవర్గస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా కో-ఆర్డినేటర్ వై.యశోదలక్ష్మి, ప్రిన్సిపాల్ నూక రామకృష్ణలు అభినందించారు.

ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

మండపల్లిలో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని మండపల్లిలో పశు సంవర్ధకశాఖ, అజిల్లా పశుసంవర్ధకశాఖ అభివృద్ధి సంఘం ఆధ్వర్యాన మంగళవారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ సిహెచ్.సత్యప్రకాష్ మాట్లాడుతూ మేలైన లేగ దూడలు మంచి పాడి పశువులు గా రూపాంతరం చెంది రైతులకు ఆర్థిక స్థిరత్వం అందించడంలో ప్రయోజనకారిగా ఉంటాయని అన్నారు. రైతులు లేగదూడల సంరక్షకులు మెలకువలు పాటించాలని సూచించారు. అనంతరం లేగ దూడలకు నట్టల నివారణ మందులు, కాలియా టానికీలు అందించారు. సుమారు 45 దూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమలు కోట రమేష్, పోరేపు బలందావన, వెంక, నరేష్‌లు గెలుపొందారు. కార్యక్రమంలో పాతుర్ల చంద్రశేఖర్‌రెడ్డి, నూక రాజు, కె.గోపి, పరమేష్, పి.వల్లభరావు పాల్గొన్నారు.

లేగ దూడలను ప్రదర్శిస్తున్న రైతులు

సమీక్షిస్తున్న మాట్లాడుతున్న గోవిందరావు

త్వరితగతిన ధాన్యం కొనుగోలు

ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గం ఐదు మండలాల తహశీల్దార్లు, సిఎస్‌డిటిలు, వ్యవసాయాధికారులతో మంగళవారం సమీక్షించారు. రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. ఒక్క గింజ కూడా నిల్వ ఉండకుండా, తేమ శాతం పేరుతో వివాదాలు లేకుండా పారదర్శకంగా కొనుగోలు చేపట్టాలని సూచించారు. రైతులకు న్యాయమైన ధర అందేవిధంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న సిఐ రామకృష్ణ

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ కెటి రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుటున్నట్టు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్పెషల్ డ్రైవర్ నిర్వహించారు. తన సిబ్బందితో రోడ్డు వెంబడి నడుచుకుంటూ వ్యాపారులకు తగు సూచనలు చేశారు. వారం రోజుల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేందుకు వ్యాపారులు సహకరిస్తే మంచిదని పేర్కొన్నారు అదేవిధంగా పరిమితికి మించిన స్పీడు డ్రైవింగ్, పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం తాగడం, ఈవ్ టీజింగ్, గంజాయి తదితర నేర నియంత్రణపై నిఘా పెట్టామన్నారు.కాలేజీలు విడిచిపెట్టిన సమయాల్లో కొంతమంది విద్యార్థులు ఆకతాయిలుగా ప్రవర్తిస్తున్నారని, దీనిని సరిదిద్దుకోకపోతే కేసులు తప్పవని హెచ్చరించారు.

జ్ఞాపికలను అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

విజేతలకు జ్ఞాపికలు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో 76వ నియోజవర్గస్థాయి అంతర పాఠశాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం జ్ఞాపికులను అందజేశారు. రెండు రోజులుగా క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ జగన్, ఎంఇఒ-2 ఎస్.విశ్వనాథ్, పిఇటి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. తొగరాం పంచాయతీలో దిబ్బలపేట, ఇసకలపేట, హనుమంతుపురం, బొబ్బిలిపేట గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల ఇసకలపేటకు వెళ్లే రోడ్డుపై కంకర వేసి రోలర్‌లో మట్టించారు. వారం రోజులు తరువాత రోడ్డుపై రాళ్ల పిక్కలు తేలడంతో వాహనాల టైర్లు ఫంచర్లు అవుతున్నాయి. దీంతో అవస్థలు పడుతున్నారు. పాదచారుల కాళ్లకు తాకడంతో నడేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయాలను వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.11 కోట్లతో 11 ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు కార్యాలయాల భవనాలు నిర్మించి ప్రారంభించినట్లు వెల్లడించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి ఆవరణలో రూ.92.22 లక్షలతో నిర్మించిన ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయం, సహాయ సంచాలకులు కార్యాలయాలను శాసన సభ్యులు గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఎన్నో పనులు చేపట్టడమైందన్నారు. డ్రగ్స్ కంట్రోల్ కీలకమని తెలిపారు. గతంలో అద్దె భవనాల్లో ఔషధ నియంత్రణ కార్యాలయం ఉండేదన్నారు. ఔషధ నియంత్రణ జిల్లా అధికారి చంద్రరావు మాట్లాడుతూ నూతన భవనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం ఆనందంగా

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ఉందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఆర్ వంశధార చైర్మన్ అరవల రవీంద్రబాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, జిజిహెచ్ సూపరింటెండెంట్ ప్రసన్న కుమార్, ఎపిఎంఐసిడిఎస్ ఇఇ శిమ్మన్న, ఔషధ నియంత్రణ అధికారి ఎన్.యుగంధర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కలకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి- కవిటి

మల్లేశ్వరరావు

సొంతిల్లు నిర్మించుకోవాలని ఆశపడే ఎంతోమందికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు తెలిపారు. 2019 నుంచి 2024 మధ్య వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా ఎస్‌సి, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌సిలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత లబ్ధిదారులు బిల్లులు అందిస్తే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. సొంతింటి కల నెరవేర్చడం ప్రభుత్వం బాధ్యతని, దాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురంలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన గ్రిగ్స్ క్రీడా పోటీల్లో ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బాలికల జూనియర్ కబడ్డీ విభాగంలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, బాలుర రన్నింగ్ సీనియర్ విభాగంలో బైపిల్లి రాజు తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.సంతోషి, పిఎస్ హెచ్‌ఎం బల్లెడ లక్ష్మణమూర్తి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బెందాళం శాంతమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సమాజంలో బాల్య వివాహాలతో జరుగుతున్న అనర్థాలను రూపుమాపడానికి విద్యావంతులైన బాలికలు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా బాలల రక్షణ ప్రతినిధి ఎ.గీత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ సూపర్వైజర్ ఎం.జానకీలక్ష్మి ఆధ్వర్యాన బాల్య వివాహ రహిత భారత దేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూర్జ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ అంటూ బాలికలు నినాదాలు చేస్తూ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతులు

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శరత్‌బాబు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలురు కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని, మెరుగైన బోధన అందుతుందని ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు అన్నారు. అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత, కెడబ్ల్యు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనుభవం, అంకిత భావం కలిగిన అధ్యాపకులతో బోధన ఉంటుందన్నారు. ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, నీట్, ట్రిపుల్ ఐటి తదితర అనేక రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తమ్మయ్య, బలివాడ ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు సేకరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతుల వివరాలు సేకరించాలని ఐసిటిఎస్ఎఫ్ ఎ.శివకృష్ణ అన్నారు. మండలంలోని దూసి రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు వస్తున్న రైతుల వివరాలను కచ్చితంగా సేకరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిడిఎఫ్ సురేష్ ఆధ్వర్యాన ట్రైనీ ఐసిఆర్‌పిలకు ఉర్వి యాప్‌లో రైతుల వివరాలను ఎలా

శిక్షణ ఇస్తున్న శివకృష్ణ

నమోదు చేయాలన్న అంశాలపై శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అవసరమైన పక్కా ప్రణాళికలను రూపొందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎఫ్‌ఎంటి రవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందరాజులు

కేంద్రమంత్రిపై విమర్శలు తగవు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్ర పౌరవిమానాయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఇండిగో వ్యవహారంపై ప్రతి పక్షాలు విమర్శలు చేయడం తగదని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండిగో గతనెలలో ఇండిగో యాజమాన్యంతో ఎప్‌డిటిసి నిబంధనలు అమలు చేయడం కోసం సమావేశం నిర్వహించి నిబంధనలపై చర్చించినా ఆ నిబంధనలు ఇండిగో బేఖారు చేస్తూ నిబంధనలు పాటించకపోవడం ముఖ్య కారణమన్నారు. సిబ్బంది రోష్టరింగ్ విధానాలు లోపం, ఇండిగో సిబ్బంది నియామకం తగినంతగా నియమంచపోవడం వల్ల కేంద్రమంత్రిపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజమన్నారు. సమావేశంలో కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరమణ, నీటి సంఘాల అధ్యక్షుడు కర్రి అప్పారావు, పిఎసిఎస్ డైరెక్టర్లు సాసుమంతు ఆనందరావు, రాంకుమార్, కొత్తమ్మతల్లి ఆలయ పాలకమండలి అధ్యక్షులు కోరాడ గోవిందరావు, టిడిపి పట్టణశాఖ అధ్యక్షులు కోరాడ పెద్ద గోవింద, బోయిన వెంకప్ప పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల సాయం

ప్రజాశక్తి- కవిటి

కవిటి గ్రామ బీచ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనులు దాతల సహకారంతో వేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గర్భాలయం పైన రెండు గాలిగోపురాల నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల నిధులు అవసరమైన నేపథ్యంలో దాతలు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం వాస్తవ్యులు కుందల రామ్‌ప్రసాద్, కె.ఎస్.కళ్యాణి దంపతులు రూ.21 వేలు విరాళం అందజేశారు. అలాగే కవిటికి చెందిన అగ్నికుల క్షత్రియ కుటుంబానికి చెందిన నాగల కాంతమ్మ వారి కుటుంబ సభ్యులు కలిసి రూ.పది వేలు విరాళంగా

నగదు అందిస్తున్న దాతలు

ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో బి.పి.రెడ్డి, ఆరింగి మధు మాస్టర్, పాండవ చంద్రశేఖర్, ఆరింగి రాజు, మొగలిపురి సీతారాం, ఈపరి వెంకట రమణ, మండల జగన్, పొల్లాయి రుద్రయ్య, పొల్లాయి దుర్యోధన, బెందాళం వకీల్ రాంబాబు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి వచ్చే 4 వరకు నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం రైస్ మిల్లు, ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారుర. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తున్న సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు కన్వీనర్ పనస రమేష్. రైస్ మిల్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

అవంతికని అభినందిస్తున్న అధ్యాపకులు

ఖోఖోలో మెరిసిన అవంతిక

రణస్థలం: రాష్ట్రస్థాయిలో ఖోఖోలో మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అవంతిక తృతీయ స్థానం సాధించింది. అనకాపల్లి జిల్లా లంకెలపాలెంలో నిర్వహించిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా అండర్ 14 ఖోఖో జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ జట్టు గెలుపులో రణస్థలం మండలం మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కొంతాల అవంతిక ఏడో తరగతి విద్యార్థిని భాగస్వామ్యం వహించింది. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు సరిదేవి శివశంకర్, వ్యాయామ ఉపాధ్యాయులు పైల సత్యవతి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ రహీం, టి.సురేష్, బి.జి.హరినాథ్, జి.చిన్నకృష్ణం నాయుడు, వై.ప్రమీల, పి.శ్రీదేవి అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న దాతలు

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

బూర్జ: బూర్జ శాఖా గ్రంథాలయానికి పలువురు దాతలు ముందుకొచ్చారు. కొద్ది రోజులుగా పుస్తకాల లేమి దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయం సమస్యలతో సతమతమవుతుంది. ఉపాధ్యాయుడు ముడిల తన తోటి ఉపాధ్యాయులు కుమిలి దిలీప్ కుమార్‌కు వివరించారు. దీనిపై స్పందించిన దిలీప్ కుమార్ ప్రత్యూషల వివాహ దినోత్సవం సందర్భంగా మంగళవారం గ్రంథాలయానికి పోటీ పరీక్షల మెటీరియల్‌లను అందజేశారు. తన మిత్రులైన పట్నాయకుని శివప్రసాద్ బారాటం మాధవరావు, వారణాసి మోహనరావు, కోట్నీ సాయిప్రసాద్‌లకు తెలిపారు. దీనిపై వారు కూడా స్పందించి గ్రంథాలయానికి అవసరమైన కుర్చీలను అందజేశారు. గ్రంథాలయ సమస్యలను తెలుసుకొని దాతలు ముందుకు వచ్చి పోటీ పరీక్షలు మెటీరియల్‌లను, పర్నిచర్ అందించిన దాతలను గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మాట్లాడుతున్న రాములు

ఆమదాలవలస: హౌస్ ఆఫ్ ప్రేయర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన పట్టణంలో నిర్వహించిన యూత్ క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంతో సాగాయి. ప్రాంగణం సందడిగా యువతతో నిండిపోగా క్రిస్మస్ సందేశాలు ఆరాధనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ కె.రాములు మోజస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్ అని అన్నారు. రెవరెండ్ జి.సామ్యూల్ అరుణ్‌కుమార్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో బ్రదర్ రవి, చిన్నబాబు, పాస్టర్ అహరోన్ రాజ్ రెవరెండ్ కృపావరం, క్రిస్టఫర్, సింహాచలం పాల్గొన్నారు.